ఖాళీలు భర్తీ చేయండి

- పశుసంవర్ధకశాఖ డైరెక్టరుకు డివైఎఫ్ఐ వినతి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

పశుసంవర్ధకశాఖలో ఖాళీగా ఉన్న 4,765 అసిస్టెంట్ పోస్టులను తక్షణమే భర్తీ చేయాలని డివైఎఫ్ఐ రాష్ట్ర కమిటీ కోరింది. ఈ మేరకు ఆ సంఘం కార్యదర్శి జి రామన్న పశు సంవర్ధకశాఖ డైరెక్టరు అమరేంద్రకుమార్‌ను బుధవారం కలిసి వినతిపత్రం అందజేశారు. రాష్ట్రంలో 50 వేలమందికి పైగా నిరుద్యోగులు డెయిరీ డిప్లమో, ఒకేషనల్ కోర్సులు పూర్తిచేసి ఎహెచ్ఎ పోస్టుల కోసం శిక్షణ కేంద్రాల్లో వేలకు వేలు వెచ్చించి మూడేళ్ల నుంచి ఎదురుచూస్తున్నారని తెలిపారు. పశుసంవర్ధక అధికారులు అనాలోచితంగా క్లస్టర్ విధానాన్ని తీసుకొచ్చారని అన్నారు. ఈ విధానం వల్ల ఉన్న ఉద్యోగాలు మిగులుతాయని, శాశ్వతంగా పోస్టులు భర్తీ కావని ఆవేదన వ్యక్తం చేశారు. పలు సమస్యలను అధికారుల దృష్టికి తీసుకొచ్చామని, ఎలాంటి ఫలితం లేదని అన్నారు. ఈ క్లస్టర్ విధానాన్ని రద్దు చేసి నిరుద్యోగులకు న్యాయం చేయాలని కోరారు. లేదంటే రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనకు దిగుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు పి కృష్ణ, అభ్యర్థులు శ్రీను, అనిల్, నరసింహ, హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

హెచ్ఆర్‌సిలో స్టాఫ్ భర్తీ చర్యలు చెప్పండి : హైకోర్టు

ప్రజాశక్తి-అమరావతి

రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ (హెచ్ఆర్‌సి)లో సిబ్బంది భర్తీకి తీసుకున్న చర్యలు తెలియజేయాలని రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశించింది. విచారణను 2 వారాలకు వాయిదా వేస్తూ తాత్కాలిక చీఫ్ జస్టిస్ ఎవి శేషసాయి, జస్టిస్ రావు రఘునందన్‌రావుతో కూడిన డివిజన్ బెంచ్ బుధవారం విచారణ జరిపింది. హెచ్ఆర్‌సిలో అవసరమైన సిబ్బందిని నియమించేలా ఉత్తర్వులు ఇవ్వాలని, అక్కడ ప్రజల ఫిర్యాదులను స్వీకరించే యంత్రాంగం ఏర్పాటుకు కూడా ఉత్తర్వులు ఇవ్వాలంటూ ఎపి సివిల్ లిబర్టీస్ అసోసియేషన్ ప్రజాహిత వ్యాజ్యాన్ని దాఖలు చేసింది. సిబ్బంది లేకపోవడంతో హెచ్ఆర్‌సి ఛైర్మన్ ఇచ్చే తీర్పులను ఆయనే టైప్ చేసుకోవాల్సిన పరిస్థితి ఉందని పిటిషనరు తరపున న్యాయవాది బి శ్రీనివాసరావు వాదించారు. సిబ్బంది కొరత వల్ల జాప్యం అవుతోందని ఛైర్మన్ ఒక తీర్పులో పేర్కొన్నారని తెలిపారు. ప్రభుత్వం తరపున అడ్వకేట్ జనరల్ ఎస్ శ్రీరామ్ ప్రతివాదన చేస్తూ, కాంట్రాక్టు పద్ధతిలో సిబ్బంది నియామక చర్యలు తీసుకోనున్నట్లు చెప్పారు. ఈ మేరకు మంత్రివర్గం కూడా నిర్ణయం తీసుకుందన్నారు. విచారణను రెండు వారాలకు వాయిదా వేశారు.

పట్టిసీమపై దృష్టి సారించని సర్కార్

- కృష్ణా డెల్టాకు పెరుగుతున్న నీటి ఎద్దడి
- జలాశయాల్లో పడిపోతున్న నిల్వలు

ప్రజాశక్తి- గుంటూరు జిల్లా ప్రతినిధి

కృష్ణా పరివాహక ప్రాంతంలో ఈ ఏడాది సాగు నీటి ఎద్దడి తీవ్రం కానుంది. ప్రధానంగా 13.65 లక్షల ఎకరాలు సాగయ్యే కృష్ణా డెల్టాలో ఈ ఏడాది సేద్యం ఇబ్బందికరంగా మారింది. గతంలో ఎన్నడూ లేనివిధంగా ఏడాది జులై 19వ తేదీ వరకు ఆల్మట్టి జలాశయానికి నీరు రాకపోవడంతో ఈ ఏడాది సాగు పరిస్థితి ఏమిటన్నది ప్రశ్నార్థకంగా మారింది. ఈ నేపథ్యంలో ప్రభుత్వం ప్రత్యామ్నాయాలపై దృష్టి సారించకపోవడం విమర్శలకు తావిస్తోంది. కృష్ణా డెల్టాకు ఎదురయ్యే ఇబ్బందులను దష్టిలో పెట్టుకొని గత ప్రభుత్వం గోదావరి జలాలను కృష్ణా డెల్టాకు వినియోగించేందుకు పట్టిసీమ ఎత్తిపోతల పథకాన్ని ప్రారంభించింది. 2016 నుంచి మూడేళ్లపాటు ఏటా 80 టిఎంసిల వరకు గత టిడిపి ప్రభుత్వం కృష్ణా డెల్టాకు అందించింది. 2019లో అధికారంలోకి వచ్చిన వైసిపి ప్రభుత్వం గత నాలుగేళ్లుగా పట్టిసీమ నీటిని వినియోగించుకోలేదు. గత నాలుగేళ్లుగా కృష్ణా ఎగువ ప్రాంతం నుంచి సకాలంలో నీరు రావడం, ఏటా వరదలు కూడా సంభవించడం వల్ల ఈ కాలంలో నీటి సమస్య అంతగా రాలేదు. ఈ ఏడాది కృష్ణా ఎగువ

పట్టిసీమ లిఫ్ట్ ఇరిగేషన్ (ఫైల్ ఫొటో)

ప్రాంతంలో ప్రధానంగా కర్ణాటకలో వర్షాలు లేకపోవడం, ఆల్మట్టి జలాశయానికి నీరు రాకపోవడం వల్ల రైతులకు ఇబ్బందికరమైన పరిస్థితి ఏర్పడింది. శ్రీశైలం, నాగార్జునసాగర్, పులిచింతల నీటిమట్టం గణనీయంగా తగ్గిపోతోంది. కృష్ణా డెల్టా ఆయకట్టు స్థిరీకరణ కోసం నిర్మించిన పులిచింతల జలాశయంలో గరిష్ట నిల్వ 45.77 టిఎంసిలు. బుధవారం 17.95 టిఎంసిల నీరు మాత్రమే నిల్వ ఉంది. గతేడాది జులై 19న 37.27 టిఎంసిల నీరు ఉండేది. నాగార్జునసాగర్‌లో గరిష్ట నీటి నిల్వ 312 టిఎంసిలు. ప్రస్తుతం 144.94 టిఎంసిలు మాత్రమే ఉన్నాయి. గతేడాది ఇదే రోజుకు 171.48 టిఎంసిల నీరు నిల్వ ఉంది. శ్రీశైలంలో గరిష్ట నీటి నిల్వ 215.80 టిఎంసిలు. ప్రస్తుతం 33.62 టిఎంసిల నీరు నిల్వ ఉంది. గతేడాది ఇదే రోజుకు 147.99 టిఎంసిల నీరు నిల్వ ఉండేది. ఈ ఏడాది శ్రీశైలంలో నీటిమట్టం గణనీయంగా తగ్గిపోయింది. కృష్ణా తూర్పు డెల్టాలో వరి సాగు కోసం గత కొన్ని రోజులుగా రోజూ ఆరు వేల క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. కృష్ణా జిల్లాలో 4.22 లక్షల ఎకరాల్లో వరి సాగు జరుగుతుందని అంచనా వేశారు. ప్రస్తుతం లక్ష ఎకరాల్లో వరి సాగవుతోంది. కృష్ణా పశ్చిమ డెల్టాకు వెయ్యి క్యూసెక్కుల నీరు ఇస్తున్నారు. ఈ డెల్టాలో 4.36 లక్షల ఎకరాల్లో వరి సాగు జరగాల్సి ఉన్నా ఇంకా వరి నాట్లు ప్రారంభం కాలేదు. వెద పద్ధతిలో 20 వేల ఎకరాల్లోనే సాగు ప్రారంభించారు. గతేడాది జులై రెండో వారం నాటికి ఆల్మట్టి, నారాయణ్‌పూర్, జూరాల జలాశయాలకు వరద ప్రారంభమైందని, ఈ ఏడాది ప్రస్తుతం కర్ణాటకలో వర్షాలు లేక ఎగువ నుంచి జలాశయాలకు నీరు రావడంలేదని అధికారులు తెలిపారు.

నివేదిక వస్తే నిర్ణయం

కృష్ణా డెల్టాలో నీటి ఎద్దడిపై క్షేత్రస్థాయి పరిశీలన చేసి అధికారులు నివేదిక పంపితే ప్రత్యామ్నాయంపై దృష్టి సారిస్తాం. పట్టిసీమ నుంచి గోదావరి జలాలు వినియోగించాలని నీటిపారుదల శాఖాధికారుల ప్రతిపాదిస్తే ప్రభుత్వం తగు నిర్ణయం తీసుకుంటుంది. కృష్ణా డెల్టాకు తక్షణం నీరు అవసరమైతే వెంటనే పట్టిసీమ నుంచి విడుదలకు నిర్ణయం తీసుకుంటాం.

-అంబటి రాంబాబు, రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి

సోషల్ వెల్ఫేర్ జాయింట్ డైరెక్టరు ప్రసాద్ ఇళ్లపై ఎసిబి దాడులు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

అక్రమాస్తులు కూడబెట్టారని ఆరోపిస్తూ.. ఎపి సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ ఇన్స్టిట్యూషన్స్ సొసైటీ జాయింట్ డైరెక్టరు కెడివిఎమ్ ప్రసాద్ ఇళ్లపై ఎసిబి ఆకస్మిక దాడులు నిర్వహించింది. బుధవారం విజయవాడలోని బృందావన కాలనీలోని ఆయన ఇంటితోపాటు, బంధువుల ఇళ్లలో ఏకకాలంలో ఎసిబి అధికారులు సోదాలు నిర్వహించారు. ఆదాయానికి మించి ఆస్తులు కూడబెట్టినట్లు అందిన సమాచారం మేరకు ఎసిబి అధికారులు సోదాలు చేపట్టారు. ప్రసాద్ 1991లో హైదరాబాద్‌లో ఐటిబిపి కానిస్టేబుల్‌గా, ఎస్ఐఎఫ్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా ఎస్ఐ, సిఐగా పనిచేశారు. 2007లో ఎపిపిఎస్‌సి ద్వారా గ్రూప్-1లో ట్రైజరిశాఖలో ఎటిఒగా చేరారు. తెలంగాణలోని భువనగిరి, కృష్ణా జిల్లా డిఆర్‌డిఎ ప్రాజెక్టు డైరెక్టరుగా పనిచేశారు. డిప్యూటేషన్‌పై కృష్ణా జిల్లా ఎస్ఎస్ఎ ప్రాజెక్టు డైరెక్టరుగా పనిచేసిన ప్రసాద్ ప్రస్తుతం ఎపి సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ ఇన్స్టిట్యూషన్స్ సొసైటీ జాయింట్ డైరెక్టరుగా పనిచేస్తున్నారు. తన సర్వీసులో నిబంధనలకు విరుద్ధంగా ఏలూరులో రెండు ప్లాట్లు, విజయవాడలోని పోరంకిలో రెండు ప్లాట్లు, ఏలూరులోని మాదేపల్లిలో ఆర్‌సిసి ఇళ్లు, మాదేపల్లిలో మరో భవనం, హైదరాబాద్‌లో జిప్లస్-2 భవనం, పామర్రులో ప్లాట్, దెందులూరు మండలంలో 90 సెంట్ల వ్యవసాయ భూమిని గుర్తించారు. అలాగే మూడు కార్లు, మూడు ద్విచక్ర వాహనాలు, 500 గ్రాముల బంగారం, రూ.30 వేలు నగదు, రూ.15 లక్షలు విలువ చేసే ఎల్ఐసి పాలసీలు, మౌనిక ఆక్వా ఫామ్‌లో పెట్టుబడులు, ఇతరులకు వడ్డీలకు ఇచ్చిన రూ.26 లక్షలు విలువ చేసే ప్రామిసనరీ నోట్లను ఎసిబి అధికారులు స్వాధీనం చేసుకున్నారు.

ప్రకాశం జిల్లా కొనకమిట్ల పోలీస్ స్టేషన్ ఎస్ఐ కె దీపిక, కానిస్టేబుల్ పి నరసింహారావును లంచం తీసుకుంటుండగా ఎసిబి అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. హెచ్ఎం పాడు మండలం, రాజగారి పల్లె గ్రామానికి చెందిన జి నరసింహా అతని కుటుంబ సభ్యుల నుండి 498 కేసు నుండి తొలగించేందుకు రూ.60 వేలను డిమాండ్ చేశారు. జి నరసింహా బుధవారం రూ.45 వేలను ఇస్తుండగా రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకుని కేసు నమోదు చేశారు.

'చందమామ' ప్రభాకర్‌కు కన్నీటి వీడ్కోలు

ప్రజాశక్తి - విజయవాడ

ప్రముఖ కళాకారుడు, చిత్రకారుడు ప్రభాకర్ (75) అంత్యక్రియలు బుధవారం విజయవాడలో జరిగాయి. గాంధీనగర్‌లోని తన స్వగృహంలో ప్రమాదవశాత్తూ బాత్‌రూమ్‌లో జారిపడి తుదిశ్వాస విడిచారు. 'చందమామ' ప్రభాకర్‌గా ఆత్మీయంగా పిలుచుకునే ఆయనకు భార్య, కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ప్రభాకర్ చందమామ పత్రికతోపాటు అనేక పత్రికల్లో చిత్రకారుడిగా, డిజిటల్ ఆర్టిస్ట్‌గా పని చేశారు. ఆయనకు సంగీతం పట్ల కూడా అభిరుచి ఉంది. ఆయన మతికి పలువురు సంతాపం తెలిపారు.

డిప్రెషన్‌కు గురయ్యా

- ఆత్మహత్య ఆలోచనలు వచ్చాయి
- బ్రిజ్ భూషణ్ లైంగిక వేధింపులే కారణం
- మహిళా రెజ్లర్ ఆరోపణలు

న్యూఢిల్లీ : రెజ్లింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (డబ్ల్యూఎఫ్ఐ) చీఫ్ బ్రిజ్ భూషణ్ శరణ్ సింగ్‌పై పోలీసులకు ఫిర్యాదు చేసిన మహిళల్లో ఒకరు తనకు ఎదురైన మానసిక వేదనను వెలిబుచ్చారు. తాను డిప్రెషన్‌తో బాధపడుతున్నాననీ, లైంగిక వేధింపుల కారణంగా ఆత్మహత్య ఆలోచనలు వచ్చాయని వివరించారు. బ్రిజ్‌భూషణ్ సింగ్‌పై గత నెలలో దాఖలు చేసిన చార్జిషీట్‌లో మహిళ ఆరోపణలను పోలీసులు పేర్కొన్నారు. డబ్ల్యూఎఫ్ఐ చీఫ్ ఐపీసీలోని సెక్షన్ 354, 354ఎ, 354డీ కింద శిక్షార్హుడని పోలీసులు చార్జిషీట్‌లో పేర్కొన్నారు. 1599 పేజీల చార్జిషీట్‌లో ఆరుగురు రెజ్లర్ ఫిర్యాదుదారుల వాంగ్మూలాలు ఉన్నాయి. బ్రిజ్‌భూషణ్ సింగ్ చర్యల కారణంగా తాను డిప్రెషన్‌లోకి వెళ్లి ఆత్మహత్య చేసుకోవాలనే ఆలోచనలో పడ్డానని వారిలో ఒక మహిళ చార్జిషీట్‌లో పేర్కొన్నది. బ్రిజ్‌భూషణ్ ను కలిసేందుకు నిరాకరించడంతో ప్రధాని మోడీని కలిసేందుకు వెళ్లిన అథ్లెట్ల జాబితా నుంచి తన పేరు తొలగించారని ఆ మహిళ ఆరోపించింది. మరో ఫిర్యాదుదారు 2009లో సింగ్‌తో "రాజీ" చేసుకోవడానికి నిరాకరించినందున రెజ్లింగ్ రంగానికి తిరిగి రాలేకపోయానని వివరించింది. 2021లో తన అడ్వాన్సులను తిరస్కరించిన తర్వాత బ్రిజ్‌భూషణ్ సింగ్ తన కెరీర్‌ను ముగించేస్తానని బెదిరించాడని మరో రెజ్లర్ ఆరోపించారు.

యుపిలో దారుణం

- దళిత బాలుడిపై అమానవీయ చర్య
- తీవ్రంగా కొట్టి.. మలాన్ని చేతితో తొలగించాలంటూ బలవంతం
- కేసు నమోదు చేసిన పోలీసులు

లక్నో : బిజెపి పాలిత యూపిలో దళితులపై పెత్తందార్ల ఆగడాలు పెరిగిపోతున్నాయి. యోగి పాలనలో మహిళలతో పాటు దళితులకు రక్షణ ఉండటం లేదు. ఏదో ఒక విధంగా వారిపై దాడులు నిత్యకృత్యమవుతున్నాయి. తాజాగా ఒక దళిత బాలుడిపై దాడి జరిగింది. అంతే కాకుండా మలాన్ని చేతితో తీయాలంటూ ఆ బాలుడిని నిందితుడు బలవంతం చేయటం గమనార్హం. ఎటవా జిల్లా సైఫైలో ఈ ఘటన చోటు చేసుకున్నది. ఈ ఘటన తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ఈ ఘటనపై దళిత సంఘాల నాయకులు, సామాజిక, ప్రజా సంఘాల నేతలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నిందితులపై కఠిన చర్యలకు వారు డిమాండ్ చేశారు. పోలీసులు, బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం.. బాధితుడు (15) 11వ తరగతి చదువుతున్నాడు. అయితే, ఉదయం జగ్రామ్ యాదవ్ వ్యవసాయ భూమిలో బహిర్భూమికి వెళ్లాడు. అయితే, ఇది గమనించిన జగ్రామ్ యాదవ్.. బాలుడిపై ఆగ్రహంతో ఊగిపోయాడు. బాలుడిని తీవ్రంగా కొట్టాడు. బాలుడి చేతితోనే అతని(బాలుడి) మలాన్ని తీసివేయించాడు. జిల్లాలోని ప్రసన్న పంచాయతీలో ఈనెల 13న ఈ ఘటన చోటు చేసుకున్నది. ఈ ఘటనపై బాధితుడి తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేశారు. జగ్రామ్ యాదవ్.. ఘటనకు దగ్గర పొలాల్లో పని చేస్తున్న తమ బంధువు ఈ దాడిని ఆపేందుకు యత్నించినందుకు ఆమెపై కూడా దాడికి పాల్పడ్డాడని బాలుడి తండ్రి తన ఫిర్యాదులో పేర్కొన్నాడు. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కింద నిందితుడిపై కేసు నమోదు చేసినట్టు జిల్లా పోలీసు అధికారి తెలిపారు. జగ్రామ్ యాదవ్ పరారీలో ఉన్నాడనీ, అతనిని అరెస్టు చేయడానికి పోలీసులు గాలింపు చర్యలు చేపడుతున్నారని చెప్పారు. అయితే, జగ్రామ్ యాదవ్.. కోర్టులో సరెండర్ అప్లికేషన్‌ను దాఖలు చేయటం గమనార్హం.

రుషికొండపై నిర్మాణాల నివేదికను ఎంఒఇఎఫ్‌కు ఇస్తే అభ్యంతరం ఎందుకు?

- రాష్ట్ర ప్రభుత్వ వైఖరి చెప్పాలి : హైకోర్టు

ప్రజాశక్తి-అమరావతి

విశాఖలోని రుషికొండపై అనుమతులకు మించి జరిపిన తవ్వకాలు, నిర్మాణాలపై చట్ట ప్రకారం చర్యలు తీసుకునే అంశాన్ని కేంద్ర ప్రభుత్వ పర్యావరణ శాఖకు నివేదించే ఆలోచనలో ఉన్నామని హైకోర్టు స్పష్టం చేసింది. ఉల్లంఘనలు తీవ్రంగా ఉన్నాయో లేదో కేంద్ర పర్యావరణ అటవీ మంత్రిత్వశాఖ (ఎంఒఇఎఫ్)ను కోరనున్నామని తెలిపింది. దీనిపై రాష్ట్ర ప్రభుత్వానికి అభ్యంతరం ఎందుకని ప్రశ్నించింది. ఎంఒఇఎఫ్ చేసిన అనుమతులకు లోబడి నిర్మాణాలు ఉండాలని సుప్రీంకోర్టు ఉత్తర్వులు ఇచ్చిందని తెలిపింది. ఎంఒఇఎఫ్‌కు నివేదిక ఇచ్చే విషయంలో ప్రభుత్వ అభిప్రాయం చెప్పాలని కోరింది. అనుమతి నిబంధనలను ఉల్లంఘించి చేసిన నిర్మాణాలను కొనసాగించకుండా ఉత్తర్వులు ఇవ్వాలంటూ దాఖలైన అనుబంధ పిటిషన్‌ను తాత్కాలిక చీఫ్ జస్టిస్ ఎవి శేషసాయి, జస్టిస్ రావు రఘునందన్‌రావుతో కూడిన డివిజన్ బెంచ్ విచారణ జరిపింది. విశాఖ తూర్పు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు, జనసేన నేత పివిఎన్ఎన్ మూర్తి యాదవ్ వేసిన పిల్స్‌లో తనను ప్రతివాదిగా చేర్చాలంటూ నర్సాపురం ఎంపి కనుమూరి రఘురామ కృష్ణరాజు వ్యాజ్యాలను బుధవారం హైకోర్టు విచారించింది.

రుషికొండపై నిర్మాణాలను సర్వే చేసి రిపోర్టు ఇవ్వాలని కేంద్ర పర్యావరణ, అటవీశాఖను గతంలో హైకోర్టు ఆదేశించింది. ఆ ప్రాంతాన్ని పరిశీలన చేసి నివేదిక ఇవ్వడం కోసం కమిటీని ఏర్పాటు చేసింది. కమిటీ పర్యటించాక ఎంఒఇఎఫ్ ఇచ్చిన నివేదికలో అనుమతులకు మించి నిర్మాణాలు జరిగాయని పేర్కొంది. యాదవ్ తరపున సీనియర్ న్యాయవాది కెఎస్ మూర్తి వాదిస్తూ.. నివేదిక నేపథ్యంలో నిర్మాణాలు నిలిపేయాలని కోరారు. ఈ వ్యవహారాన్ని ఎంఒఇఎఫ్‌కు నివేదించాలన్న హైకోర్టు ప్రతిపాదనను ప్రభుత్వ ప్రత్యేక న్యాయవాది సుమన్ వ్యతిరేకించారు. హైకోర్టు తుది ఉత్తర్వులు ఇవ్వాలని కోరారు. ప్రభుత్వ అభిప్రాయాన్ని తెలియజేయాలని ఆదేశించిన హైకోర్టు విచారణను 2 వారాలకు వాయిదా వేసింది.

అధమ స్థాయిలో విద్యా వ్యవస్థ

- టిడిపి ఎమ్మెల్సీ రామ్‌గోపాల్ రెడ్డి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో విద్యా వ్యవస్థను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధమస్థాయికి చేర్చారని టిడిపి ఎమ్మెల్సీ భూమిరెడ్డి రామ్‌గోపాల్ రెడ్డి విమర్శించారు. నాడు-నేడు, అమ్మఒడితో విద్యా వ్యవస్థలో గొప్ప సంస్కరణలు తీసుకొచ్చామని చెప్పుకుంటున్న సిఎం ప్రభుత్వ పాఠశాలల్లో 7.5 లక్షల మంది విద్యార్థులు ఎందుకు తగ్గారని ప్రశ్నించారు. టిడిపి కార్యాలయం ఎన్‌టిఆర్ భవన్‌లో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లో సరైన మౌలిక వసతులు కల్పించకపోవడం, విద్యాప్రమాణాలు పెంచే దిశగా విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడంలో జగన్ ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని విమర్శించారు. ఎన్నికలకు ముందు ఏకోపాధ్యాయ పాఠశాలలు లేకుండా చేస్తానన్న జగన్ నేటికీ 9,600పైగా పాఠశాలలు ఉండటంపై ఏం సమాధానం చెబుతారని ప్రశ్నించారు. జాతీయ విద్యావిధానం పేరుతో 117 జిఓ ద్వారా ప్రాథమిక విద్యను సర్వనాశనం చేశారని విమర్శించారు. మెగా డిఎస్‌సి నిర్వహిస్తానని చెప్పి నాలుగున్నరేళ్లలో ఒక్క నోటిఫికేషన్ కూడా విడుదల చేయలేదన్నారు.

175 ఎకరాల ప్రభుత్వ భూమి కబ్జా

- పిల్‌లో ప్రతివాదులకు హైకోర్టు నోటీసులు

ప్రజాశక్తి-అమరావతి

పల్నాడు జిల్లా వినుకొండ మండలం బ్రాహ్మణపల్లి గ్రామ పరిధిలోని వివిధ సర్వే నంబర్లలోని 175 ఎకరాల ప్రభుత్వ, ఎసైన్డ్ భూములు అన్యాక్రాంతం అవుతున్నాయనే పిల్‌లో ప్రతివాదులకు హైకోర్టు నోటీసులు జారీ చేసింది. మాల్పూరి అగ్రోటెక్ ప్రైవేట్ లిమిటెడ్, శ్రీవత్స ఫుడ్‌పార్క్ ప్రైవేట్ లిమిటెడ్ ప్రభుత్వ భూముల్ని ఆక్రమించుకున్నాయని, వాటిని రక్షించాలంటూ వినుకొండకు చెందిన కీర్తిపాటి వెంకటేశ్వర్లు దాఖలు చేసిన ప్రజాహిత వ్యాజ్యాన్ని బుధవారం హైకోర్టు విచారించింది. ప్రతివాదులైన మాల్పూరి అగ్రోటెక్ ప్రైవేట్ లిమిటెడ్ ఎమ్‌డి, వినుకొండ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు, శ్రీవత్స ఫుడ్‌పార్క్ ఎమ్‌డి లక్ష్మణస్వామి, రెవెన్యూశాఖ ముఖ్యకార్యదర్శి, పంచాయతీరాజ్‌శాఖ ముఖ్యకార్యదర్శి, పల్నాడు జిల్లా కలెక్టరు, సబ్ కలెక్టర్, ఆర్‌డిఒ, వినుకొండ తహశీల్దారు తదితరులకు నోటీసులు జారీ చేసింది. కౌంటర్ దాఖలు చేయాలని తాత్కాలిక చీఫ్ జస్టిస్ ఎవి శేషసాయి, జస్టిస్ రావు రఘునందన్‌రావుతో కూడిన డివిజన్ బెంచ్ ఆదేశించింది. ఆ 175 ఎకరాలను బ్యాంక్‌లో తనఖా పెట్టి రూ.50 కోట్లను రణంగా తీసుకుని మరో నేరానికి పాల్పడ్డారని పిటిషనర్ తరపున న్యాయవాది జడ శ్రావణ్ కుమార్ చెప్పారు. భూమిని స్వాధీనం చేసుకునేలా ఉత్తర్వులు ఇవ్వాలని కోరారు. విచారణ 4 వారాలకు వాయిదా పడింది.

టిఎఆర్ఎల్ టెస్టు ఫలితాలు ఎందుకు వెల్లడించలేదు?

- రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించిన హైకోర్టు

ప్రజాశక్తి-అమరావతి

టెస్ట్ విద్యార్థి 5వ తరగతి పుస్తకాలను, 5వ తరగతి విద్యార్థి రెండో తరగతి పుస్తకాలను చదవలేని దుస్థితిలో ఉండటంపై హైకోర్టు తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. ఈ పరిస్థితి ఉన్నందున అందరూ సిగ్గుపడాలని వ్యాఖ్యానించింది. భావితరాలు పరిస్థితి తలుచుకుంటే బాధేస్తోందని చెప్పింది. మాతృభాష రాకపోతే అవమానంగా భావించేవారని, ఇప్పుడు తెలుగు రాకపోవడం ఉన్నత విషయంగా భావించడం సిగ్గుచేటని వ్యాఖ్యానించింది. ఇలాంటి సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం తీసుకునే చర్యలు వివరించాలని కోరింది. బేస్ లైన్, టిఎఆర్ఎల్ టెస్టు ఫలితాలను ఎందుకు ప్రచురించలేదో చెప్పాలంది. ఈ నెల 22న జరిగే విచారణలోగా కౌంటర్ దాఖలు చేయాలని తాత్కాలిక చీఫ్ జస్టిస్ ఎవి శేషసాయి, జస్టిస్ రావు రఘునందన్‌రావుతో కూడిన డివిజన్ బెంచ్ ఆదేశించింది.

విద్యాహక్కు చట్టం, ఎన్‌సిఇఆర్‌టి (స్టేట్ కౌన్సిల్ ఆఫ్ ఎడ్యుకేషన్ రీసెర్చ్, ట్రైనింగ్) ప్రకారం బేస్ లైన్, టిఎఆర్ఎల్ (టీచింగ్ ఎట్ రైట్ లెవల్ టెస్ట్) టెస్టుల ఫలితాల్ని ప్రభుత్వం ప్రకటించకపోవడాన్ని తప్పుపడుతూ డాక్టర్ గుంటుపల్లి శ్రీనివాస్ దాఖలు చేసిన పిల్‌ను బుధవారం హైకోర్టు విచారించింది. న్యాయవాది కారుమంచి ఇంద్రనీల్‌బాబు వాదిస్తూ.. ఆ ఫలితాల్ని వెబ్‌సైట్‌లో పెట్టి తీసేశారన్నారు. 2వ తరగతి పుస్తకాన్ని 5వ తరగతి వాళ్లు, 5వ తరగతి పుస్తకాన్ని పదో తరగతి విద్యార్థులు చదవలేకపోతున్నారని చెప్పారు.

మహిళా కార్యదర్శుల్ని కానిస్టేబుళ్లుగా చేయొద్దు

- హైకోర్టులో వాదనలు

ప్రజాశక్తి-అమరావతి

గ్రామ, వార్డు సచివాలయాల్లో పనిచేస్తున్న మహిళా సంరక్షణ కార్యదర్శులను దొడ్డిదారిలో మహిళా కానిస్టేబుళ్లుగా చేసే ప్రయత్నాలను అడ్డుకోవాలని హైకోర్టులో వాదనలు జరిగాయి. చట్ట వ్యతిరేక ప్రభుత్వ చర్యను అడ్డుకోవాలని పిటిషనరు తరపున న్యాయవాది వడేరా బాలాజీ వాదించారు. మహిళా సంరక్షణ కార్యదర్శులకు, మహిళా కానిస్టేబుళ్లకు నియామకాల విద్యార్హతలు వేర్వేరని చెప్పారు. మహిళా సంరక్షణ కార్యదర్శులను మహిళా కానిస్టేబుళ్లుగా పేర్కొంటూ వెలువడిన జిఓలను విశాఖకు చెందిన ఆరేటి ఉమామహేశ్వరావు ప్రజాహిత వ్యాజ్యాన్ని దాఖలు చేశారు. ఇదే తరహాలో పలువురు మహిళా సంరక్షణ కార్యదర్శులు కూడా రిట్లు దాఖలు చేశారు. వీటిని న్యాయమూర్తులు జస్టిస్ యు దుర్గాప్రసాదరావు, జస్టిస్ వెంకట జ్యోతిర్మయితో కూడిన డివిజన్ బెంచ్ బుధవారం విచారించింది. పిటిషనర్ల వాదనలు పూర్తికావడంతో ప్రభుత్వం తరపున అడ్వకేట్ జనరల్ ఎస్ శ్రీరామ్ వాదనల నిమిత్తం విచారణ గురువారానికి వాయిదా పడింది.

దక్షిణమధ్య రైల్వే
మమ్మల్ని @SCRailwayindia ద్వారా అనుసరించండి.
ద.మ.రైల్వేలోని టెండరు ప్రకటనల వివరాలు మా వెబ్‌సైట్ www.scr.indianrailways.gov.in లో చూడండి.
ఇ-టెండరు ప్రకటన సం. 409/డిఆర్ఎం/డబ్ల్యు/జిఎన్‌టి తేది: 17.07.2023 PUB/0791
క్రింది సంతకందారు దిగువ పేర్కొన్న పనుల కొరకు 10.08.2023న 15:30గం.ల వరకు ఇ-టెండర్లను ఆహ్వానిస్తున్నారు.
క్ర.సం.: 1, టెండరు ఐడి: 2582, సీనియర్ డిఇఎన్/డిఇఎన్: ఎన్, పని వివరణ: డిఇఎన్/నార్త్/సెక్షన్ పరిధిలో ఎడిఇఎన్/ఎస్ఎల్‌డిఎ సబ్-డివిజన్‌లో లెవల్ క్రాసింగ్స్‌కు మరమ్మత్తులు, సుమారు విలువ: రూ.72,78,032/-, బిడ్ సెక్యూరిటీ: రూ.1,45,600/-
క్ర.సం.: 2, టెండరు ఐడి: 2583, సీనియర్ డిఇఎన్/డిఇఎన్: ఎన్, పని వివరణ: డిఇఎన్/నార్త్/సెక్షన్ పరిధిలో ఎడిఇఎన్/నార్త్/జిఎన్‌టి సబ్-డివిజన్‌లో లెవల్ క్రాసింగ్స్‌కు మరమ్మత్తులు, సుమారు విలువ: రూ.76,79,779/-, బిడ్ సెక్యూరిటీ: రూ.1,53,600/-
క్ర.సం.: 3, టెండరు ఐడి: 2584, సీనియర్ డిఇఎన్/డిఇఎన్: డబ్ల్యు, పని వివరణ: ఎన్‌డబ్ల్యు-1: 1.865కి.మీ. (ఎన్‌డిఎల్) పూర్తి దూరం కొరకు 60కెజి/90యుటిఎస్ రెయిల్స్ (సిఐ-2)తో పిఎస్‌సి6 స్లీపర్స్ పై ప్రస్తుత 52కెజి/90యుటిఎస్ రెయిల్స్ యొక్క టిఆర్ఆర్(ఎస్) మరియు 2.717కి.మీ. (పిపిఎం, డికెడి, ఎన్‌బిఆర్) యొక్క పూర్తి దూరం కొరకు బలాస్ట్ కుషన్ రీకూప్మెంట్ మరియు బలాస్ట్ యొక్క డీప్ స్క్రీనింగ్‌తోసహా 1540నం.లు/కి.మీ.లతో కొత్త వెడల్పు పిఎస్‌సి స్లీపర్స్ పై 60కెజి/90యుటిఎస్ (సిఐ-2) రెయిల్స్‌తో పిఎస్‌సి5 స్లీపర్స్ పై ప్రస్తుత 52కెజి/90యుటిఎస్ రెయిల్స్ యొక్క సిటిఆర్(ఎస్). ఎన్‌డబ్ల్యు-2: డిఇఎన్/దెస్ట్/జిఎన్‌టి సెక్షన్ లో296 గ్లూడ్ జాయింట్స్ యొక్క రినెవల్ మరియు మొత్తం 8 నం.ల కొరకు జిఎన్‌టి-కెసిసి సెక్షన్-4నం.లు, జిఎన్‌టి-ఎన్‌డికెడి సెక్షన్-2నం.లు మరియ